

రక్షణ బాధ్యత ప్రభుత్వాలది

విధుల్లో ఉండే మహిళా వైద్యుల రక్షణ బాధ్యత ప్రభుత్వాలది. తెల్ల కోటు ధరించిన వారికి మరకలు అంటే పరిస్థితి రాకూడదు. రోగి ఎంతటి బాధలో ఉన్నా వైద్యుడ్ని చూడగానే ధైర్యం వస్తుంది. అలాంటిది ప్రాణం పోసే వైద్యులకే రక్షణ లేకుంటే ఇక సమాజం మనుగడ సాగించడం కష్టం. మహిళా డాక్టర్ల భద్రతకు భరోసా కల్పించాలి. ప్రశాంత వాతావరణంలో వారు విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలి. వైద్యులపై దాడులు అరికట్టేందుకు చట్టాలను కఠినతరం చేయాలి. కోల్‌కతా ఘటనలో నిందితులకు కఠిన శిక్ష విధించేలా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చూడాలి.

–డాక్టర్ రాజశేఖర్, పోతవరం పీహెచ్‌సీ, నల్లజర్ల మండలం





మహిళా ఉద్యోగుల రక్షణకు చట్టాలుండాలి

ఆసుపత్రుల్లో మహిళా ఉద్యోగుల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకు రావాలి. మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా రాత్రి పూట విధులు నిర్వహించే మహిళా ఉద్యోగులకు సరైన భద్రత కల్పించాలి. మహిళా ఉద్యోగులపై ఆయా ఆసుపత్రులు, కార్యాలయాల్లోను, బయట లైంగిక వేధింపులు, దాడుల నియంత్రణకు ప్రజల్లో చైతన్యం రావాలి. మహిళా రక్షణ కోసం కొత్త చట్టాలను తీసుకొచ్చి నిష్పక్షపాతంగా అమలు చేయాలి.

–కె.సాయికిరణ్, సివిల్ సర్జన్ స్పెషలిస్ట్, ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి, కొవ్వూరు

ఇంటింటా జ్వర పీడితులు

- పల్లెలను వణికిస్తున్న వైరల్ జ్వరాలు
- పీహెచ్‌సీల్లో భారీగా కేసుల నమోదు
- ఎక్కువ మందికి వంటి నొప్పులు, చలి జ్వరాలు



దేవరపల్లి సీహెచ్‌లో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

దేవరపల్లి: వైరల్ జ్వరాలు పల్లెలను వణికిస్తున్నాయి. పలు రకాల సీజనల్ జ్వరాలతో ప్రజలు మంచం పట్టారు. చలి, జ్వరం, వంటి నొప్పులు, కీళ్లనొప్పులు, వాంతుల వంటి వ్యాధులతో పాటు టైఫాయిడ్, మలేరియా జ్వరాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రతి ఇంటి వద్దా ఒకరో, ఇద్దరో జ్వర పీడితులు ఉన్నారు. ఎక్కువగా వైరల్ జ్వరాలు ఉండగా, అక్కడక్కడా మలేరియా, టైఫాయిడ్ కేసులు నమోదవుతున్నాయి. గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉంది. ఒక్కొక్క ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోజుకు 50 నుంచి 70 వరకూ జ్వరాల కేసులు నమోదవుతున్నాయి. ప్రభుత్వాసుపత్రులకు రాని రోగులు గ్రామాల్లోని ఆర్‌ఎంపీ, పీఎంపీల వద్ద వైద్యం చేయించుకుంటున్నారు. జ్వరం తీవ్రత ఎక్కువగా ఉన్న రోగులు పట్టణ ప్రాంతాల్లోని కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి రూ.లక్షలు ఖర్చు పెట్టి వైద్యం పొందుతున్నారు. ఇటీవలి వరకూ విస్తారంగా వర్షాలు కురిశాయి. రెండు వారాలుగా ఉక్కపోతతో కూడిన ఎండ తీవ్రత నమోదవుతోంది. ఇలాంటి వాతావరణ మార్పుల వల్ల సీజనల్ జ్వరాలు ఎక్కువగా వ్యాపించినట్టు వైద్యులు చెబుతున్నారు. కూలీనాలీ చేసుకుని జీవించే పేద, మధ్యతరగతి ప్రజలు ఖరీదైన వైద్యం చేయించుకోలేక ఇబ్బంది పడుతున్నారు. రోజుల తరబడి జ్వరంతో బాధపడ్డాక, కార్పొరేట్ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోగా కొంతమందికి డెంగీ ఫీవర్ లక్షణాలు నిర్ధారణ అవుతున్నట్టు సమాచారం. అయితే డెంగీ కేసులు బయట పడకుండా వైద్యులు గోప్యత పాటిస్తున్నారు.ఇక ప్రభుత్వ వైద్యాధికారులైతే డెంగీ కేసులు లేవని చెబుతున్నారు.

కానరాని వైద్య శిబిరాలు

ప్రజలను జ్వరాలు పట్టి పీడిస్తున్నప్పటికీ ఎక్కడా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. దీంతో రోగులు ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించి వైద్యం పొందవలసి వస్తోంది. గోపాలపురం సీహెచ్ పరిధిలో జ్వరపీడితుల సంఖ్య ఎక్కువగా ఉంది. వివిధ గ్రామాల నుంచి వచ్చిన రోగులు ఆసుపత్రిలో ఇన్ పేషెంట్లుగా వైద్యం పొందుతున్నారు. దేవరపల్లి మండలంలోని దేవరపల్లి, యాదవోలు, గౌరీపట్నం పీహెచ్‌సీల పరిధిలోనూ జ్వరాల కేసులు ఎక్కువగానే నమోదవుతున్నాయి. యాదవోలు పీహెచ్‌సీలో రోజుకు 50 నుంచి 70 జ్వరాల కేసులు నమోదవుతున్నాయి. దేవరపల్లి, గౌరీపట్నం పీహెచ్‌సీల్లో కూడా రోజుకు 30 నుంచి 50 కేసులు నమోదవుతున్నట్టు వైద్యాధికారులు తెలిపారు. గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

జ్వరాలతో అప్రమత్తంగా ఉండాలి



జ్వరం వచ్చిన వెంటనే దగ్గరలోని పీహెచ్‌సీని సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలి. వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల వైరల్, టైఫాయిడ్ జ్వరాలు ఎక్కువగా ఉన్నాయి. రోజుకు 30 నుంచి 40 మంది జ్వరంతో పీహెచ్‌సీకి వస్తుండగా వైద్య పరీక్షల అనంతరం 5 నుంచి 10 మందికి వైరల్, టైఫాయిడ్ జ్వరాలుగా నిర్ధారిస్తున్నాం. డెంగీ జ్వరాలు ఇంత వరకూ నమోదు కాలేదు.ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించి దోమల నివారణ చర్యలు తీసుకోవాలి. దోమలు కుట్టకుండా చూసుకోవాలి. వ్యాధి నిర్ధారణ తర్వాత పూర్తి కోర్సు మాత్రలు మింగాలి.

– డాక్టర్ జి.సతీష్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, గౌరీపట్నం

అన్నిరకాల వైద్య పరీక్షలూ చేస్తున్నాం



ఆసుపత్రికి వస్తున్న రోగులకు అన్నిరకాల వైద్యపరీక్షలూ చేస్తున్నాం. వైరల్ ఫీవర్స్ ఎక్కువగా ఉన్నాయి. డెంగీ, మలేరియా కేసులు లేవు. వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల వైరల్, టైఫాయిడ్ జ్వరాలు ఉన్నాయి. రోజుకు 15 నుంచి 20 జ్వరం కేసులు నమోదవుతున్నాయి. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి. వేడిగా ఉన్న ఆహార పదార్థాలను మాత్రమే తీసుకోవాలి. జ్వరాల గురించి ఆందోళన చెందనవసరం లేదు.

– డాక్టర్ సీహెచ్ హరిచందన, వైద్యాధికారి, పీహెచ్‌సీ, యాదవోలు

జ్వరం తగ్గడం లేదు



కొద్దిరోజులుగా జ్వరం వస్తోంది. గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి వెళితే వైద్య పరీక్షలు చేశారు. మలేరియా, టైఫాయిడ్ పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో జ్వరాలు ఎక్కువగా ఉన్నాయి. వంటి నొప్పులు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. చలి, జ్వరాలు పట్టి పీడిస్తున్నాయి.

– కె. జోత్స్న, వేళ్లచింతలగూడెం, గోపాలపురం మండలం

క్లుప్తంగా

ఇసుక ర్యాంపులో కంటైనర్ రేకుల చోరీ



ఇసుక ర్యాంపులో చోరీకి గురైన రేకులు

కొవ్వూరు: స్థానిక ఏరినమ్మ ఇసుక ర్యాంపులో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. ఇక్కడి ఏపీఎండీసీకి చెందిన ఐరన్ కంటైనర్‌ను మట్టా శివ అనే వ్యక్తి కట్ చేసి, వాటి ఇనుప రేకుల చోరీకి పాల్పడ్డాడు. అయితే నిందితుడు శివ వద్ద నుంచి ఐరన్ రేకులను స్వాధీనం చేసుకున్నట్టు కొవ్వూరు ఇన్‌చార్జ్ తహసీల్దార్ కె.అజయ్‌బాబు బుధవారం తెలిపారు. ఈ ఘటనపై వేములూరు వీఆర్వోను విచారణకు ఆదేశించామని చెప్పారు. అంతేగాకుండా ఈ చోరీపై కొవ్వూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయాలని వీఆర్వో కేటీఆర్‌ఎల్ నరసింహను ఆదేశించినట్టు తహసీల్దార్ తెలిపారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



స్టడీ మెటీరియల్ పొందిన విద్యార్థినులతో దాతలు

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురం కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులు నేషనల్ మెరిట్ మీన్స్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు సన్నద్ధం అవుతున్నారు. ఈ పరీక్షకు సిద్ధం అవుతున్న 20 మంది విద్యార్థులకూ ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయురాలు రమాదేవి దంపతులు రూ.5 వేల విలువైన స్టడీ మెటీరియల్‌ను బుధవారం అందజేశారు. మండలంలోని మిగిలిన పాఠశాలల విద్యార్థులకు కూడా స్టడీ మెటీరియల్ అందజేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం సుభాషిణి, ఉపాధ్యాయురాలు భవాని, శ్రీనివాస్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

రామాలయ పునః నిర్మాణానికి శంకుస్థాపన



తాడిపూడిలో రామాలయ పునః నిర్మాణానికి శంకుస్థాపన దృశ్యం

తాళ్లపూడి: మండలంలోని తాడిపూడి గ్రామంలో, శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో బుధవారం రామాలయ పునః నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. పాత రామాలయం శిథిలావస్థకు చేరడంతో ఆలయాన్ని పునః నిర్మించడానికి చర్యలు చేపట్టారు. ఆ సంఘం సభ్యులు చింతపల్లి బుజ్జి, వెంకటలక్ష్మి, కేతా రాంబాబు, లక్ష్మి దంపతులు పీటలపై కూర్చుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త అల్లూరి విక్రమాదిత్య, నాయకులు నామా కొండ బాబు, కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి, కొలుకుల అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో నాతి బుజ్జికి సత్కారం



ఎంపీడీవో నాతి బుజ్జిని సత్కరిస్తున్న సర్పంచులు

చాగల్లు: సాధారణ ఎన్నికల సమయంలో చాగల్లు ఎంపీడీవోగా సమర్థవంతంగా విధులు నిర్వహించిన నాతి బుజ్జి ఇటీవలే అంబేద్కర్ కోనసీమ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి ఆధ్వర్యంలో బుధవారం ఆమెను సన్మానించారు. పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఆయా శాఖల అధికారులు ఎంపీడీవోను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

రంగంపేట: సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ తోట కృష్ణసాయి తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని మర్రిపూడి గ్రామంలో తనిఖీలు నిర్వహించగా గ్రామ శివారులో పీతా వీర వెంకటరమణ సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కోరుకొండలో కుక్కల బెడద

మధురపూడి: కోరుకొండలో కుక్కల బెడద ఎక్కువైంది. కూరగాయల మార్కెట్, శివాలయం రోడ్డు, రామకృష్ణ సినిమా థియేటర్ ప్రాంతాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఇటీవల ఇద్దరు కుక్కకాటుకు గురయ్యారు. పంచాయతీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

లక్ష్మీ గణపతి, జ్ఞాన సరస్వతి విగ్రహాల ప్రతిష్ఠ



పిట్టల వేమవరం రామాలయంలో లక్ష్మీ గణపతి, జ్ఞాన సరస్వతి విగ్రహాల ప్రతిష్ఠ వేడుకలో టి. వెంకటరెడ్డి, సూర్రెడ్డి దంపతులు

ఉండ్రాజవరం/పెరవలి: పెరవలి మండలం పిట్టల వేమవరం గ్రామంలోని సీతారామస్వామి ఆలయంలో బుధవారం లక్ష్మీ గణపతి, జ్ఞాన సరస్వతీ దేవి విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ వేడుకను వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఫణికుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తమనంపూడి వెంకటరెడ్డి, సూర్రెడ్డి దంపతులు పీటలపై కూర్చుని పూజాదికాలు నిర్వర్తించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై లక్ష్మీ గణపతి, జ్ఞాన సరస్వతి అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తాడిపర్రులో శ్రీకృష్ణునికి పూజలు

కృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని మండలంలోని తాడిపర్రు గ్రామంలోని శ్రీకృష్ణుడు ఆలయంలో గురువారం కృష్ణుడి విగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం తాడిపర్రు పరిసర గ్రామ ప్రజలు శ్రీకృష్ణుడుని దర్శించుకుని, ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్న సమారాధనలో పాల్గొన్నారు. గ్రామ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఈ వేడుక నిర్వహించారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



నిడదవోలులో ఉట్టి కొడుతున్న భక్తులు

నిడదవోలు: కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా పట్టణంలోని రుక్మిణి, సత్యభామ సమేత మదన గోపాలస్వామి వారి ఆలయంలో బుధవారం స్వామివారికి అభిషేకాలు, సహస్ర నామ పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద సాయంత్రం ఉట్టి కొట్టారు. ఉట్టి కొట్టేందుకు యువత ఉత్సాహంగా పోటీ పడ్డారు. గుడ్ల విజయకుమార్ అనే వ్యక్తి ఉట్టి కొట్టి రాధాకృష్ణుల ఫొటోను బహుమతిగా గెలుచుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. శ్రావణ మాసం సందర్భంగా మహిళా భక్తులు దీపారాధన చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నామా సూర్యప్రకాశరావు, అర్చకుడు గోవర్ధన దుర్గాప్రసాదాచార్యులు పాల్గొన్నారు.

పోతవరంలో శ్రీనివాస కల్యాణం

108 మంది దంపతులకు వస్త్రదానం



స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న సత్యనారాయణ, రామలక్ష్మి దంపతులు

నల్లజర్ల: శ్రావణ మాసం..దశమి సందర్భంగా బుధవారం పోతవరం గ్రామంలో శ్రీనివాస కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రత్తిపాటి సత్యనారాయణ, రామలక్ష్మి దంపతులు పీటలపై కూర్చున్నారు. వేద పండితులు హనుమత్‌వజ్ఝల సతీష్ శర్మ పూజాదికాలు నిర్వహించారు. దాదాపు రూ.లక్ష ఖర్చుతో తయారు చేయించిన శ్రీవేంకటేశ్వర, పద్మావతి, అలివేలు మంగ కాంస్య విగ్రహాలకు పంచామృతాభిషేకాలు, కుంకుమార్చన, కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పోతవరానికి చెందిన వరసిద్ధి వినాయక భజనమండలి సభ్యులు ఉదయం 5 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ శ్రీనివాస కల్యాణ గానామృతం చేశారు. అలాగే 108 మంది దంపతులను సత్కరించి నూతన వస్త్రాలు అందజేశారు. ద్వారకాతిరుమల నుంచి 500 లడ్డూలు తీసుకు వచ్చి వారికి అందజేశారు. అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తయారు చేసిన వెండి శుభలేఖను, కాంస్య విగ్రహాలను భజనమండలికి సత్యనారాయణ దంపతులు బహూకరించారు.

విజ్జేశ్వరంలో పడవ కార్మికుల నిరసన



విజ్జేశ్వరం బ్యారేజీ వద్ద నిరసన తెలుపుతున్న పడవల యజమానులు, కూలీలు

నిడదవోలు రూరల్: పశ్చిమ డెల్టా ప్రధాన కాలువలో పడవల ద్వారా ఇసుక రవాణాకు అనుమతి ఇచ్చి తమకు జీవనోపాధి కల్పించేందుకు కృషి చేయాలని పడవ నిర్వాహకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని విజ్జేశ్వరం బ్యారేజీ వద్ద శ్రీదుర్గా బోట్స్‌మెన్, సాండ్ క్వారీ వర్కర్స్ కో–అపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో పడవల యజమానులు, కూలీలు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ అధ్యక్షుడు శ్రీరంగం గోవిందరాజులు మాట్లాడుతూ 4 నెలలుగా పడవలపై ఇసుక రవాణా లేకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. తాళ్లపాలెం వరకూ ఇసుక రవాణా చేసేందుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. సుమారు 70 పడవల ద్వారా 700 మంది కూలీలు ఇసుక రవాణా చేసి ఉపాధి పొందుతున్నామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకుడు దేవర దుర్గాప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

రైల్వే హాల్టుల కోసం ఉత్తరాల ఉద్యమం



రైల్వే మంత్రికి రాసిన ఉత్తరాలు చూపుతున్న డీఏవీ పాఠశాల విద్యార్థినులు, రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు

కొవ్వూరు: స్థానిక రైల్వే స్టేషన్‌లో 2019 నాటికి ఆగే అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను హాల్టులను పునరుద్ధరించాలని కోరుతూ బుధవారం పట్టణంలోని డీఏవీ స్కూల్ విద్యార్థులతో రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌కు ఉత్తరాలు రాయించారు. రైల్వే పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది రాసిన ఉత్తరాలను సమితి సభ్యులు చూపిస్తూ కొవ్వూరు రైల్వే స్టేషన్‌ను పరిరక్షించాలని, ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టులు పునరుద్ధరించాలంటూ నినాదాలు చేశారు. రైల్వే స్టేషన్ పరిరక్షణ సమితి సభ్యులు వీటీ విల్సన్‌రాజు, పడాల సుబ్బారెడ్డి, కేవీ రమణ,కొండపల్లి రత్నసాయి, వైకే శ్రీనివాస్, ఎం.రమేష్, కేఎస్ రాజు, పిక్కి నాగేంద్ర, కె.గణేష్, ఈ.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను అడ్డుకుంటే సహించబోం

- కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- చాగల్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



సమావేశంలో ఎమ్మెల్యే వెంకటేశ్వరరావుతో మాట్లాడుతున్న సర్పంచ్ శ్రీరాంమూర్తి

చాగల్లు: ఎవరైనా ప్రజాప్రతినిధులు అడ్డుపడినప్పటికీ గ్రామాల అభివృద్ధికి సంబంధించిన ఏ పనీ ఆగదని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. చాగల్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మట్టా వీరాస్వామి అధ్యక్షతన బుధవారం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి తొలి విడతగా మండలంలోని చాగల్లు, మీనానగరం, చిక్కాల గ్రామాలకు రూ.1.10 కోట్లు మంజూరు చేశామన్నారు. మిగిలిన గ్రామాలకూ కూడా త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం హయంలో ఇక మీదట ఆర్థిక సంఘం నిధులన్నీ పంచాయతీలకు నేరుగా జమ చేస్తామన్నారు. అనంతరం చంద్రవరం సర్పంచ్ మద్దిపాటి శ్రీరామమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు ఆత్కూరి గోపీచంద్ మాట్లాడుతూ తమ పంచాయతీల అభివృద్ధికి కూడా నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే గ్రామాల్లో అభివృద్ధి పనులను ఎంపిక చేసేటపుడు స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని కోరారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. కాగా దిగువ స్థాయి అధికారులు పూర్తిస్థాయి సమాచారం లేకుండా సమావేశానికి రావడంతో ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో పి.నిర్మలకుమారి. వైస్ ఎంపీపీ సీహెచ్ విజయ, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

చిడిపిలో 150 మందికి వైద్య సేవలు



క్యాన్సర్ రోగికి ఆర్థిక సహాయం అందిస్తున్న సర్పంచ్, లయన్స్ క్లబ్ సభ్యులు

కొవ్వూరు: మండలంలోని చిడిపి గ్రామంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చిడిపి సర్పంచ్ పాలడుగుల లక్ష్మణరావు పుట్టిన రోజు సందర్భంగా లయన్స్ క్లబ్ కొవ్వూరు శాఖ సభ్యులు ఆ గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన లిటిల్ స్టార్ అండ్ షీ తల్లీపిల్లల ఆసుపత్రి వైద్యులు ఈ శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు చేశారు. పిల్లల, స్త్రీ సంబంధిత, సాధారణ వ్యాధులకు వారు సేవలు అందించారు. కీళ్ల నొప్పులు, బీపీ, షుగర్ వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి కూడా పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇద్దరు క్యాన్సర్ రోగులకు ఆర్థిక సహాయం చేశారు. ఒక క్యాన్సర్ రోగికి లక్ష్మణరావు వ్యక్తిగతంగా రూ.10 వేల సాయం అందించగా, మరొక రోగికి లయన్స్ క్లబ్ తరపున రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. లయన్స్ క్లబ్ కొవ్వూరుశాఖ అధ్యక్షుడు మద్దిపాటి వీర వెంకట సత్యనారాయణ, పూర్వ అధ్యక్షుడు కలగర వెంకట్రావు, యనమదల సుబ్రహ్మణ్యం, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, ఎండీ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా కృష్ణవేణి బాధ్యతల స్వీకరణ



నిడదవోలు కమిషనర్ కృష్ణవేణికి స్వాగతం పలుకుతున్న మున్సిపల్ అధికారులు

నిడదవోలు: నిడదవోలు మున్సిపల్ కమిషనర్‌గా టీఏ లీపీఎస్ఎస్ కృష్ణవేణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పల్నాడు జిల్లా వినుకొండ మున్సిపల్ కమిషనర్‌గా పని చేసిన కృష్ణవేణి నిడదవోలు మున్సిపాలిటికి బదిలీపై వచ్చారు.స్థానిక మున్సిపల్ అధికారులు, సిబ్బంది నూతన కమిషనర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఇక్కడ పని చేస్తున్న మున్సిపల్ కమిషనర్ టి. రాంభూపాల్ రెడ్డి డీఎంఏ కార్యాలయంలో రిపోర్టు చేశారు.

తెలగా సంఘం నవరాత్ర వేడుకల పోస్టర్ ఆవిష్కరణ



చాగల్లు తెలగా సంఘం వినాయకుడి గుడి వద్ద గణపతి నవరాత్ర మహోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

చాగల్లు: తెలగా సంఘం ఆధ్వర్యంలో ఏటా చాగల్లులో వైభవంగా నిర్వహించే గణపతి నవరాత్ర మహోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. సెప్టెంబర్ 7 నుంచి 15 వరకూ స్థానిక తెలగా సంఘ వినాయకుడి గుడి వద్ద నిర్వహించే గణపతి నవరాత్ర మహోత్సవాల వాల్ పోస్టర్‌ను బుధవారం ఆ గుడి వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నిర్వాహకుడు, మాజీ సర్పంచ్ గంద్రోతు సురేంద్రకుమార్ మాట్లాడుతూ 69వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ఏడాది ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉత్సవాలకు సెప్టెంబర్ 12న ముఖ్య అతిథులుగా హాజరయ్యే రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, సినీ నటుడు రవికృష్ణలను సత్కరిస్తామన్నారు. అలాగే సెప్టెంబర్ 10న ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో, ప్రముఖ సినీ దర్శకుడు వీవీ వినాయక్ చేతుల మీదుగా మెరిట్ విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్ బహూకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు జుట్టా కొండలరావు, పిండి మంగరాజు, అనిశెట్టి సూర్యం, దాసరి కృష్ణ, శ్రీరంగం అన్నవరం, తెలగా సంఘం పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.